సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 25 । మే । 2025



సప్తవర్ణ శోభితం

సూర్యాస్తమయం వేళ ఎంతో నిర్మలంగా ఉండే వినీలాకాశం ఒక్కసారిగా సప్తవర్ణాలను తలపించింది. అరుణ వర్ణంలో కనిపించిన ఈ సుందర దృశ్యం పాడేరు పరిసర ప్రాంతాల్లో కనువిందు చేసింది.

– సాక్షి, పాడేరు

దారీ తెన్నూ లేని పాలన!

అడుగుకో గుంత.. హామీలు గోవింద

గ్రౌండ్ సాక్షి రిపోర్ట్

'సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. రాష్ట్రంలో సుమారు 22,229 కిలోమీటర్ల రోడ్లను రూ.861 కోట్లతో బాగు చేస్తాం. నవంబర్ 2న తేదీన ప్రారంభిస్తున్నా.. సంక్రాంతి పండుగ తరువాత గుంతల్లేని రోడ్లుగా తీర్చిదిద్దుతా..'

ఇది సీఎం చంద్రబాబు 2024 నవంబర్ 2న అనకాపల్లి జిల్లా పరవాడలో రోడ్ల మరమ్మతుల కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ చెప్పిన మాటలు. రెండు రోజుల తరువాతే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇదే మాట చెప్పారు. సంక్రాంతి వెళ్ల నేటికి నాలుగున్నర నెలలు పూర్తయింది. వారి వాగ్దానం మాత్రం ఆచరణలోకి రాలేదు.



భారీ గోతులతో ఛిద్రమైన దేవరాపల్లి–వాలాబు రోడ్డు

రహ'దారి'ద్ర్యం

- అవి రోడ్లు కాదు.. నరకదారులు
- సంక్రాంతి నాటికి గోతులు లేని రహదారులుగా తీర్చిదిద్దుతామని సీఎం ప్రకటన
- నాలుగు నెలలు దాటినా అదే దుస్థితి
- వర్షాలతో చిత్తడిగా మారుతున్న రోడ్లు

సాక్షి, అనకాపల్లి: గుంతలు పూడ్చడమే కాదు ఆర్ అండ్‌బీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కొన్ని చోట్ల కొత్త రోడ్లు కూడా వేస్తామని హామీ ఇచ్చారు ప్రభుత్వ పెద్దలు. కొత్త రోడ్ల మాట దేవుడెరుగు.. జిల్లాలో గుంతలనే పూడ్చిన పాపానపోలేదు. మూడు జిల్లా కేంద్రాలను అనుసంధానిస్తూ ఉన్న ప్రధాన రహదారి రోలుగుంట– చోడవరం రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడి.. వాహనచోదకులకు ప్రాణాంతకంగా మారాయి. మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాల్లోని గిరిజన గ్రామాల రహదారులు మరింత దారుణంగా ఉన్నాయి. దేవరాపల్లి నుంచి గిరిజన పంచాయతీ వాలాబు వెళ్లే రోడ్డులో సుమారు 10 కిలోమీటర్ల మేర అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. 14 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రాతినిత్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి మరింత తీసికట్టుగా ఉంది. తాండవ రిజర్వాయరుకు వెళ్లే మార్గం గుంతలు గుంతలుగా అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హోం మంత్రి అనిత శంకుస్థాపన చేయగా ఐదు దఫాలుగా పనులు మొదలు పెట్టి ఆపేశారు. ఇందేశమ్మవాక రోడ్డుపై ప్రయాణం నరక ప్రాయం. అనకాపల్లి, కశింకోట మండలాల్లో ప్రధానంగా అనకాపల్లి–మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం, మార్టూరు, రేబాక, కొప్పాక, తోటాడ రోడ్డు, కుంచంగి, తగరంపూడి,వెంకుపాలెం పంచాయతీ పరిధిలో వేసిన రహదారులు నాణ్యత లేని కారణంగా పూడ్చిన రెండు నెలల్లోనే మళ్లీ గుంతలుగా దర్శనమిచ్చాయి. 'సాక్షి' నిర్వహించిన గ్రౌండ్ రిపోర్టులో జిల్లాలోని రహదారులు, వాటిపై గోతులు, ఆ రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రజల అవస్థలు వెలుగు చూశాయి.



చోద్యం నుంచి గొలుగొండ మండలం విప్పలపాలెం, అల్లూరి జిల్లా కంఠారం వెళ్లే రోడ్డు దుస్థితి

సీ కేటగిరి రోడ్లు టెండర్ దశలో ఉన్నాయి..

జిల్లాలో ఆర్అండ్‌బీ విభాగం నుంచి ఏ– కేటగిరిలో 123 పనులకు రూ.5.43 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అవి మొత్తం పూర్తయిపోయాయి. ఎన్‌డీబీ రోడ్లు కాకుండా మిగతావి మూడు కేటగిరీలుగా విభజించారు. ఏ కేటగిరిలో అత్యవసరంగా రోడ్లకు ప్యాచ్ వర్క్ చేసేవి. బీ– కేటగిరిలో స్ట్రెచ్‌లు పోయిన రోడ్లు, సీ–కేటగిరిలో బాగా పాడైపోయిన రోడ్లు, ప్యాచ్ వర్క్స్‌తో పూర్తికానటువంటివి. ప్రస్తుతం ఏ–కేటగిరిలో మంజూరైన 123 పనులు మరమ్మతు పనులు పూర్తయ్యాయి. బీ–కేటగిరి, సీ–కేటగిరిలో ఉన్న రోడ్ల పనులు టెండర్ దశలో ఉన్నాయి. రోలుగుంట–చోడవరం రోడ్డు ఎన్‌డీబీ రోడ్డు. దీనికి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. టెండర్ ప్రక్రియ అంతా గతంలోనే పూర్తయింది.

– ఎస్.ఆర్.ఎన్.వి రమేష్, ఆర్ అండ్ బీ ఈఈ, అనకాపల్లి జిల్లా

మృత్యు దారులు



రోలుగుంట–చోడవరం రోడ్డులో వడ్డాది వద్ద ఉన్న గుంతల్లో నిలిచిపోయిన వర్షపు నీరు

గంధవరం నుంచి వెంకన్నపాలెం, చోడవరం, విజయరామరాజు పేట, వడ్డాది, కోమళ్లపూడి, రావికమతం, కొత్తకోట, రోలుగుంట వరకూ 48 కిలోమీటర్ల మేర రోడ్డు వేయకపోవడంతో ప్రస్తుతం గోతులు కాదు నూతుల్లాగా ఉన్నాయి. 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్‌తో (60:40) రూ.112 కోట్లు మంజూరు చేశారు. టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు కాంట్రాక్ట్ అప్పగించారు. రోడ్డు ఇరుపక్కల ఏడడుగులు విస్తరించి కొత్త రోడ్డు నిర్మాణం చేయాలి. ఈ రోడ్డులో వడ్డాది, విజయరామరాజుపేట, గోవాడ వద్ద మూడు వంతెనలున్నాయి. ఇవి కూడా వేయలేదు. రోడ్డుకు ఇరువైపుల తవ్వేయడంతో వాహనదారులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నికలకు ముందు రూ.3 కోట్లతో కోమలపూడి నుంచి బంగారుమెట్ట వరకూ నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపుల విస్తరణ పనులు చేశాడు. మిగతా 44 కిలోమీటర్ల మేర రోడ్డు వేయకుండా వదిలేశాడు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిపోయినా ఈ రోడ్డులో గత ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తన సొంత నిధులు రూ.1.60 కోట్లతో ఒక కిలోమీటర్ మేర సీసీ, బీటీ రోడ్లను వేయించారు. ఎన్నికల ముందు ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తాము అధికారంలోకి వస్తే ఏడాదిలోపే ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ చర్యలు శూన్యం. ఇటీవల కాలంలో పెద్ద పెద్ద గోతులు మృత్యుకుహరాలుగా మారాయి. ఈ గోతుల్లో 30 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. సుమారుగా 40 మందికిపైగా గాయాలపాలయ్యారు. రావికమతం నుంచి కొత్తపేట, బుచ్చెయ్యపేట వద్ద చిన్నపాటి ప్యాచ్ వర్క్ మినహా కూటమి ప్రభుత్వంలో చేసిందేమి లేదు.



రోలుగుంట–చోడవరం రోడ్డులో వెంకన్నపాలెం వద్ద గుంతల్లో నిలిచిన వర్షం నీరు

ప్రమాదకరంగా ఇందేశమ్మవాక రోడ్డు



ఇందేశమ్మవారం సమీపంలో నర్సీపట్నం రోడ్డుపై గోతులు

ఎస్.రాయవరం: ఇందేశమ్మవాక రోడ్డుపై భయం భయంగా ప్రయాణం సాగించాల్సి వస్తోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రోడ్డు విస్తరణకు 8 నెలల క్రితం శంకుస్థాపన చేశారు. అడ్డురోడ్డు నుంచి కోటవురట్ల మండలం రామచంద్రపురం వరకు రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. అప్పటినుంచి కాంట్రాక్టరు పలుమార్లు పనులు చేపట్టి నిలిపివేయడంతో రోడ్డంతా గతుకులు మయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరి చెరువుల్లా దర్శనమిస్తున్నాయి.ఆ రోడ్డుపై ద్విచక్ర వాహన చోదకులు పల్టీలు కొడుతున్నారు.

కూటమి నేతల చేతివాటం

అనకాపల్లి: అనకాపల్లి మండలంలో గత ఏడాది డిసెంబర్‌లో తొమ్మిది రహదారులపై సుమారు రూ.72 లక్షలతో గోతులను పూడ్చారు. కూటమి నేతల చేతివాటంతో రెండు మాసాల్లోనే మళ్లీ గుంతలు ప్రత్యక్షమయ్యాయి. మండల పరిధిలో 50 కిలోమీటర్ల మేరకు అనకాపల్లి–మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం, మార్టూరు, రేబాక, కొప్పాక, తోటాడ రోడ్డు, కుంచంగి, తగరంపూడి, వెంకుపాలెం పంచాయతీ పరిధిలో వేసిన రహదారులు ఛిన్నాభిన్నంగా ఉన్నాయి.



అనకాపల్లి–తుమ్మపాల మార్గంలో గుండాల జంక్షన్ వద్ద..

తాండవ రోడ్డు సంగతేంటి.. అధ్యక్షా!



గుంతలతో అధ్వానంగా తాండవ రోడ్డు

నాతవరం: స్పీకరు అయ్యన్నపాత్రుడు సొంత నియోజకవర్గంలోనే రోడ్ల పరిస్థితి తీసికట్టుగా ఉంది. నాతవరం గ్రామం నుంచి తాండవ రిజర్వాయరు రోడ్డు సుమారుగా 7 కిలోమీటర్లు ఉంటుంది. ఇది తాండవ రిజర్వాయరును మూడు మండలాలను కలిపే ప్రధాన రోడ్డు. నాతవరంతోపాటు గొలుగొండ మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కొయ్యూరు మండలానికి కూడా ఈ రహదారి ఉపయోగపడుతుంది. ఈ రోడ్డు పెద్ద గోతులు పడి ప్రమాదకంగా మారింది. ఎన్నికల సమయంలో రోడ్డుపై ఎన్నో హామీలిచ్చిన అయ్యన్నపాత్రుడు అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డును పట్టించుకోలేదు.

మూన్నాళ్ల ముచ్చట

గొలుగొండ: ఏఎల్ పురం నుంచి కొంకసింగి రోడ్డు మూడు కిలోమీటర్లు. ఈ రోడ్డు మరమ్మతులకు రూ.లక్షా 25 వేలు ఖర్చు చేయగా కొంతకాలానికే రోడ్డు పెచ్చులూడిపోయింది. చీడిగుమ్మల నుంచి పుత్తడిగైరంపేట రోడ్డు మరమ్మతులకు రెండు లక్షల వరకు ఖర్చు చేయగా చాలా చోట్ల మళ్లీ పాడయింది. అయ్యన్నపాలెం నుంచి కరక వరకు సుమారుగా 9 కిలోమీటర్లకు రెండు లక్షల వరకు పనులు చేయగా రోడ్డు మరమ్మతులు సరిగా జరగలేదు. గొలుగొండ నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం దారమఠం శివాలయం రోడ్డుకు మరమ్మతులు లేక భక్తులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



గొలుగొండ మండలంలో రోడ్డు దుస్థితి

భవిష్యత్ అవసరాలు తీరేలా పథకాల రూపకల్పన



ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహిస్తున్న చైర్మన్ లంకా దినకర్, వేదికపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు, కలెక్టర్ విజయ కృష్ణన్


- 15 శాతం అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి
- వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలు సాధించాలి
- అనకాపల్లికి తాటి బెల్లం, ఆర్గానిక్ బెల్లం బ్రాండ్ ఇమేజ్
- ఇరవై సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

తుమ్మపాల: ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పించిన వికసిత్ భారత్–2047, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం స్వర్ణాంధ్ర–2047 సాధించే లక్ష్యంతో పనిచేయాలని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి ఆయన శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 15 శాతం ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పథకాలు రూపొందించాలన్నారు. జిల్లా పరిధిలో ఇప్పుడున్న సవాళ్లను అధిగమించి 'వికసిత అనకాపల్లి జిల్లా'గా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిదినాల కల్పన, మెటీరియల్ కాంపొనెంట్‌లో లక్ష్యాన్ని మించి పనిచేసినందుకు అధికార యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. కేంద్ర పథకాల అమలు తీరుతోపాటు, పర్యాటక రంగం అభివృద్ధి, ఆరోగ్యం కోసం చక్కెర స్థానంలో వినియోగించే విధంగా తాటి బెల్లం, ఆర్గానిక్ బెల్లం ఉత్పత్తిలో అనకాపల్లి జిల్లాకు బ్రాండ్ ఇమేజ్ కల్పించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయన్నారు.

విస్తృత ప్రచారం కల్పించాలి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ 20 సూత్రాల అమలు కార్యక్రమం గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గ్రామాల్లో రోడ్ల పనులు పూర్తయ్యాక సాగునీటి కాలువల లైనింగు పనులు చేపట్టాలన్నారు. జాతీయ రహదారులు, రైల్వే ట్రాక్‌ల కింద నుంచి నీటి పైపులు వేయడానికి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. అనంతరం మీడియా సమావేశంలో పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, పి.వి.జి.కుమార్, మళ్ల సురేంద్ర, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఈర్లె శ్రీరామ్మూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, హౌసింగు పీడీ వై.శ్రీనివాస్, డ్వామా పీడీ ఆర్. పూర్ణిమాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి పరారైన ముగ్గురు బాలురు క్షేమం



పట్టుబడిన మైనర్ బాలురను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ రామకృష్ణ

ఎస్.రాయవరం : ఇంటినుంచి పరారైన ముగ్గురు బాలురను సికింద్రాబాద్‌లో పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్టు అడ్డురోడ్డు సీఐ ఎల్.రామకృష్ణ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. దార్లపూడి గ్రామానికి చెందిన గొన్నా వెంకట నితిన్ పుట్టినరోజు వేడుక చేసుకునేందుకు అదే గ్రామానికి చెందిన 6వ తరగతి చదువుతున్న స్నేహితుడు చంద్రశేఖర్‌తో కలిసి ఈ నెల 20న చినగుమ్ములూరు వెళ్లారు. చినగుమ్ములూరులో మరో స్నేహితుడు 8వ తరగతి చదువుతున్న గుడాల పండుతో కలిసి ట్రైన్‌లో విశాఖపట్నం వెళ్లారు. విశాఖ బీచ్‌లో కేక్ కట్ చేసుకుని పుట్టినరోజు జరుపుకొన్నారు. ఇంట్లో చెప్పకుండా వెళ్లి పోయిన నితిన్‌కి తండ్రి నాగేశ్వరరావు పదేపదే ఫోన్ చేసినప్పటికీ నితిన్ ఫోన్ లిఫ్ట్ చేయలేదు. అక్కడ నుంచి విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ వెళ్లారు. ఉన్న డబ్బులు పూర్తిగా ఖర్చయిపోవడంతో చేతిలో సెల్‌ఫోన్ అమ్మివేసి ఆ డబ్బులు కూడా ఖర్చు చేశారు. తిరిగి వచ్చేందుకు వీలుకుదరక సిక్రిందాబాద్‌లో ఉండిపోయారు. రెండు రోజుల పాటు తమ కుమారుడు ఆచూకీ తెలియకపోవడంతో నితిన్ తండ్రి ఎస్.రాయవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోనికి దిగిన పోలీసులు దర్యాప్తు జరిపి మైనర్ బాలురు ముగ్గురూ సికింద్రాబాద్‌లో ఉన్నట్టు గుర్తించి వారిని పట్టుకున్నారు. శనివారం వారిని తల్లిదండ్రులకు అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల పరిశీలన



ఏవీఎన్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. ఆదివారం పరీక్ష జరగనున్న నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఆయన ఏవీఎన్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాలతో పాటు వివిధ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, యూపీఎస్సీ నిబంధనల ప్రకారం అన్ని చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.

పచ్చ'ధనం'.. కాపాడాలి మనం



నాగవరంలో కొడవలితో తుప్పలు తొలగిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

మునగపాక/అచ్యుతాపురం రూరల్: కలెక్టర్ విజయ కృష్ణన్ శనివారం మునగపాక, అచ్యుతాపురం మండలాల్లో పచ్చదనం–ప్రకృతి ధనం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో కలిసి నాగవరం రహదారిపై తుప్పలు తొలగించారు. మునగపాకలో లారస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం అచ్యుతాపురం ఏపీఐఐసీ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో శుభ్రం చేశారు. డీపీవో శిరీషరాణి, తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఎంపీటీసీ పాలిపిని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం సైబర్ కేసు సీఐడీకి అప్పగింత!

జాతీయ, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థల సహకారంతో లోతైన విచారణ



భోగాపురంలో నిందితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: అచ్యుతాపురం కేంద్రంగా అంతర్జాతీయ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు ఈ కేసులో మరింత పురోగతి సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ కేసు అమెరికాతో పాటు వివిధ దేశాలతో ముడిపడి ఉన్నందున మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు కేసు సీఐడీకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జాతీయ, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థల సహకారంతో సీఐడీ ద్వారా విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించి ఆ దిశగా అడుగులు వేస్తోంది. అయితే ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. నిందితులను పట్టుకున్న పవన్ రెసిడెన్సీని ఈ నెల 22న సీఐడీ ఎస్పీ సందర్శించినట్టు సమాచారం.

కింగ్ పిన్ హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో..

అంతర్జాతీయ పరిశ్రమలు ఉండే అచ్యుతాపురం శివారులో ఫేక్ కాల్ సెంటర్ ముసుగులో అంతర్జాతీయ సైబర్ కార్యకలాపాలు నిర్వహించే సైబర్ డెన్‌కు సంబంధించి కింగ్‌పిన్ హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సైబర్ కాల్ సెంటర్‌లో పనిచేసే ఉద్యోగులను హైదరాబాద్ ఓల్డ్ సిటీలో ఉన్న ఓ వ్యక్తి ద్వారా రిక్రూట్ చేసి మ్యాన్‌పవర్‌ను సరఫరా చేస్తున్నట్లు సమాచారం. పవన్ రెసిడెన్సీలో ఉన్న కాల్‌సెంటర్‌లో పనిచేసే ఉద్యోగుల్లో కొంత మందిని గుజరాత్ రాష్ట్రంలో రిక్రూట్ చేస్తే..మరికొందరినీ హైదరాబాద్ ఓల్డ్ సిటీ వేదికగా రిక్రూట్ చేసి పంపించినట్లు తెలుస్తోంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలని చెప్పి ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యత ఉన్న యువతీ,యువకులను రిక్రూట్ చేస్తున్నారు.

బాబా అణు పరిశోధన కేంద్రంలో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఆక్టోపస్ బృందం

అచ్యుతాపురం రూరల్: గడిచిన రెండు రోజులుగా బాబా అణు పరిశోధన కేంద్రంలో ఆక్టోపస్ బృందం మాక్ డ్రిల్ నిర్వహిస్తోంది. ఎస్పీ తుహిన్ సిన్హా సూచనల మేరకు డీఎస్పీలు బి.కృష్ణ, బి.మధుసూదనరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపిన వివరాల ప్రకారం బార్క్‌లో అకస్మాత్తుగా ఎప్పుడైనా తీవ్రవాదులు దాడి చేసినప్పుడు సంసిద్ధతతో ప్రతిస్పందన వ్యూహాలను అంచనా వేయడానికి మాక్ డ్రిల్ నిర్వహించారన్నారు. ఉగ్రవాద దాడి సమయంలో పోలీస్, రెవెన్యూ, వైద్య, అగ్నిమాపక విభాగాల మధ్య సమన్వయాన్ని అంచనా వేశామన్నారు. బార్క్ అధికారి ఎస్‌వీడి ప్రసాద్, ఆర్ఐ వరప్రసాద్, ఆర్ఐ రామ్మోహన్, రెవెన్యూ, వైద్య, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్



నీలం సాహ్నికి అప్పన్న చిత్రపటం అందజేస్తున్న దేవస్థానం ఈవో సుజాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న అనంతరం, అంతరాలయంలో అర్చకులు ఆమె పేరిట అష్టోత్తర పూజ నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో ఎస్. సుజాత వారికి స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రం అందజేశారు.

రోడ్డెక్కిన ఎండీయూ వాహనదారులు

పథకాన్ని కొనసాగించాలని డిమాండ్



ఉమ్మలాడలో ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఎండీయూ వాహనదారులకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు

కోటవురట్ల: ఎండీయూ వాహనదారులు రోడ్డెక్కారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉపాధి కల్పిస్తే కూటమి ప్రభుత్వం రోడ్డున పడేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఎండీయూ వాహనదారులు శనివారం ఆందోళన చేపట్టారు. ఎండీయూ వాహనాలను స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నిలిపి ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని తమను కొనసాగించాలని నినాదాలు చేశారు. వారికి మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ పరిశీలకులు డి.వి.సూర్యనారాయణరాజు సంఘీభావం తెలిపారు. అనంతరం తహసీల్దారు తిరుమలబాబుకు వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదలకు ఇంటికే రేషన్ సరుకులు అందివ్వాలనే ఆశయంతో ఎండీయూ వాహనాలను ప్రవేశ పెట్టిందన్నారు. తద్వారా రాష్ట్రంలో 9,260 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ అమలు చేయక పోగా, గత ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన పథకాలను తీసేస్తూ పేదలను ఆర్థికంగా ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. అప్పటి పథకాలను ఏదో రకంగా తీసేసి జగన్ పేరు వినపడకుండా చేయాలని కంకణం కట్టుకుందన్నారు. గత ప్రభుత్వంలో ఎండీయూ వాహనదారులకు ప్రతి నెలా 5వ తేదీలోపు రూ.21 వేలు వేతనం వారి అకౌంట్లలో జమ చేసేదన్నారు. దాంతోనే వెహికల్ ఈఎంఐ కట్టుకుని మిగిలిన డబ్బులతో కుటుంబాలను పోషించుకునేవారన్నారు. ఎండీయూ వాహనదారులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక, పది నెలలుగా వేతనాలు కూడా సక్రమంగా చెల్లించలేదన్నారు. పదో తేదీ తరువాత చెల్లించడం వల్ల చెక్ బౌన్స్ అయ్యి సిబిల్ స్కోర్ పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఈ నెలలో తమ ప్రమేయం లేకుండానే తమ అకౌంట్లలోని వేతనంలో రూ.8 వేలు తీసేసుకుందని ఆరోపించారు. ఎప్పటిలానే ఈ పథకాన్ని కొనసాగించి తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌ఎస్ సత్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉమ్మలాడలో ఆందోళనకు దిగిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మునగపాక: ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రేషన్ సరుకులను ఇంటింటికీ సరఫరా చేస్తున్న ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం ఎంత వరకు సమంజసమని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ ప్రశ్నించారు. మండలంలోని ఉమ్మలాడ జాతీయ రహదారిపై శనివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. వలంటీర్ వ్యవస్థను తొలగించి వారిని మోసం చేసిందన్నారు. ఇప్పుడు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందిస్తుంటే, దాన్ని తొలగించి డిపోల వద్దకు వెళ్లి రేషన్ తీసుకునేలా పూనుకోవడం తగదన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎం కావడం తథ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ దళిత విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు, ఎంపీటీసీలు మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, బొడ్డేడ బుజ్జి, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులు బొడ్డేడ లిల్లి, పార్టీ నేతలు బొడ్డేడ బుజ్జి, మొల్లేటి వినోద్, మురళి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళల రక్షణను పట్టించుకోని ప్రభుత్వాలు



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక: మహిళల రక్షణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఐద్వా రాష్ట్ర నాయకురాలు రమాదేవి అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో శనివారం రాష్ట్ర యువ మహిళల శిక్షణ తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి.అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు పలు ప్రాంతాల నుంచి మహిళలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఐద్వా రమాదేవి మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు ఎక్కువైపోతున్నాయని చెప్పారు. మహిళలంతా సంఘటితంగా ఇటువంటి సమస్యలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మూడు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డావెన్సీ అంతర్జాతీయ పాఠశాల డైరెక్టర్ రమణాజీ, సదాశివరావు,రొంగలి రాము,ఎస్.బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పైరుగా అపరాలు, వేరుశనగ

అనకాపల్లి: రాగల వర్షాన్ని వినియోగించుకుని నేలను దున్ని, ఖరీఫ్ పైరుగా సజ్జ, కొర్ర, అపరాలు, వేరుశనగ వంటి పంటలు వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు ఖరీఫ్ పంటగా నువ్వులను వేసుకునే రైతులు వాతావరణ పరిస్థితులు గమనించి విత్తుకోవాలన్నారు. నువ్వుల్లో అధిక దిగుబడినిచ్చే వైఎల్ఎం–17, 66 వంటి రకాలను ఎంపిక చేసుకుని విత్తుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితిని గమనించి పచ్చిరొట్ట పైరులైన జనుము లేదా జీలుగ లేదా పిల్లిపెసర లేదా పెసర విత్తుకోవాలన్నారు. తేమను ఉపయోగించుకుని 120 రోజుల వయసు గల చెరకు మొక్క, కార్సి తోటల్లో మొక్కల వరుసల మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలని సూచించారు. వర్షాధార చెరకు పంటలకు నేల తయారు చేసుకోవాలన్నారు. సాగుకు అనువైన రకాలైన 87ఎ 298, 2003వి 46, 93ఎ 145, 2003ఎ 255, 2009ఎ 107 వంటి రకాలను ఎంపిక చేసుకుని విత్తుకోవాలన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై పోలీసులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఐజీ గోపినాథ్ జెట్టి

ఎంవీపీకాలనీ(విశాఖ): పోలీసులు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి సూచించారు. విశాఖ జిల్లా ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్పత్రిలో శనివారం పోలీస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ రోజువారి విధుల ఒత్తిడిలో పోలీసులు ఆరోగ్య సమస్యలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషకాలతో కూడిన మితాహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ దిశగా వారి కుటుంబ సభ్యులు సైతం సహకారం అందించాలన్నారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మెడికవర్ హాస్పిటల్ సహకారంతో సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 750 మంది ఈ సేవలను వినియోగించుకున్నారన్నారు. గుండె, కిడ్నీ, మామోగ్రఫీ తదితర 13 రకాల పరీక్షలు మెడికవర్ హాస్పిటల్, అచ్యుతాపురానికి చెందిన రుషిల్ డెకర్స్ సహకారంతో ఉచితంగా చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ సెంట్రల్ హెడ్ డాక్టర్ సిహెచ్.అరుణ్‌కుమార్, రుషిల్ డెకర్స్ వైస్ ప్రెసిడెంట్ ఎ.కె.రాయ్, అదనపు ఎస్పీలు దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీటీసీ డీఎస్పీ బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

2న 'ఆపరేషన్ కగార్ లోగుట్టు'పై జిల్లా సదస్సు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి టౌన్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ లోగుట్టు అనే అంశంపైన వచ్చే నెల 2న పట్టణంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన సదస్సు ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సదస్సుకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు వి.ఎస్. కృష్ణ, ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ అధ్యక్షుడు పి.ఎస్. అజయ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. అభ్యుదయవాదులు, విద్యావంతులు, కార్మిక, కర్షకులు హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దేరులో పెరుగుతున్న నీటిమట్టం

మాడుగుల రూరల్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో జాలంపల్లి వద్ద పెద్దేరు జలాశయంలో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, శనివారం నాటికి 135.20 మీటర్లకు చేరుకుంది. జలాశయం పరిసర ప్రాంతంలో ఈ నెల 22న 12 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 68 క్యూసెక్కులు నీరు జలాశయంలోకి వచ్చి చేరిందని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో నర్సీపట్నం విద్యార్థులకు ఫస్ట్, సెకండ్ ర్యాంకు



మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థి చీమల దుర్గాప్రసాద్



రెండో ర్యాంకు సాధించిన విద్యార్థిని సత్యాహేమలత



ప్రతిభ చూపిన విద్యార్థులు

నర్సీపట్నం: ఏయూ డిగ్రీ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాంక్‌లు సాధించారు. బీకామ్ విద్యార్థి చీమల దుర్గాప్రసాద్ ఆంధ్రా యూనివర్సిటీ మొదటి ర్యాంక్, మరో విద్యార్థిని అనిమిరెడ్డి సత్యాహేమలత రెండో ర్యాంకు సాధించారు. వీరితోపాటు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, అధ్యాపకులు అభినందించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని జూనియర్ విద్యార్థులు కళాశాలలో సౌకర్యాలను వినియోగించుకుని కష్టపడి చదివి మంచి ర్యాంక్‌లు సాధించాలని సూచించారు. ఫలితాలపై కామర్స్ విభాగంతో పాటు మిగిలిన అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

బీఎస్సీ విభాగంలో పాయకరావుపేట విద్యార్థినికి 2వ ర్యాంక్

పాయకరావుపేట: ఆంధ్ర విశ్వవిద్యాలయం డిగ్రీ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పెసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని మాకిరెడ్డి జయంతి బీఎస్సీ విభాగంలో యూనివర్సిటీ 2వ ర్యాంక్, జిల్లా మొదటి ర్యాంకు సాధించింది. బీబీఏ విభాగంలో నక్కా సారా జిల్లా 2వ ర్యాంకు, సయ్యుద్ గుల్ఫ్‌షాన్, మద్దూరి కాశీ అన్నపూర్ణ జిల్లా 3వ ర్యాంక్ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎ.రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

రుషికొండలో బోటు షికారు పునఃప్రారంభం



బోటు షికారుకు సిద్ధమవుతున్న పర్యాటకులు

కొమ్మాది: ప్రతికూల వాతావరణం కారణంగా నాలుగు రోజులుగా నిలిచిపోయిన రుషికొండ బోటు షికారును శనివారం వాతావరణం అనుకూలించడంతో తిరిగి ప్రారంభమైందని నిర్వాహకులు తెలిపారు. వాతావరణంలో మార్పులు వస్తే తాత్కాలికంగా నిలిపివేస్తామని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అధికారుల నిర్ణయం.. విద్యార్థులకు శాపం

పాఠశాలల విలీనంతో చదువుకు అష్టకష్టాలు



ఫౌండేషన్ పాఠశాలగా మార్పు చేసిన శ్రీరాంపురం పాఠశాల

నర్సీపట్నం: విద్యాశాఖ అధికారుల నిర్ణయం.. విద్యార్థులకు శాపంగా మారింది. ప్రభుత్వం తీసుకొచ్చిన పాఠశాలల విలీన ప్రక్రియలో భాగంగా విద్యాశాఖ అధికారుల తొందరపాటు చర్యలతో కొంత మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. ఒకే పంచాయతీలో ఒకటి నుంచి మూడు పాఠశాలలు ఉంటే వీటిని కలిపి సౌకర్యాలు ఉన్న పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విలీన ప్రక్రియతో నర్సీపట్నం మండలం, దుగ్గాడ పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం గ్రామ ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు శాపంగా మారింది. ఫౌండేషన్ స్కూల్‌గా కాకుండా బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా కొనసాగించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడిని గ్రామస్థులు కలిశారు. స్పీకర్ ద్వారా మేలు చేకూరుతుందని ఆశిస్తున్నారు.

దుగ్గాడ పంచాయతీ పరిధిలో దుగ్గాడ, శ్రీరాంపురం ఎంపీపీఎస్ పాఠశాలలతో పాటు సమీపంలో ఉన్న పాతబయపురెడ్డిపాలెం పాఠశాలను విలీనం చేసి, దుగ్గాడ పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చేందుకు అధికారులు మొదట నిర్ణయం తీసుకున్నారు. పాతబయపురెడ్డిపాలెం స్కూల్ మున్సిపాలిటీ పరిధిలో ఉండడంతో విలీన ప్రక్రియకు బ్రేక్ పడింది. దుగ్గాడ, శ్రీరాంపురం పాఠశాలలను యథావిధంగా బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌గా వదిలేయవలసి ఉండగా శ్రీరాంపురం పాఠశాలను ఫౌండేషన్ స్కూల్ (1, 2 తరగతులు)గా మార్పుచేశారు. అధికారుల అనాలోచిత నిర్ణయంతో 3, 4, 5 తరగతుల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ పాఠశాలలో మొత్తం 26 మంది విద్యార్థులు ఉండగా, వీరిలో 3, 4, 5 తరగతుల విద్యార్థుల వారు 14 మంది ఉన్నారు. అర కిలోమీటరు దూరంలో ఉన్న దుగ్గాడ స్కూల్‌లో జాయిన్ చేద్దామంటే రాకపోకలు సాగించేటప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ జాయిన్ చేసినా సింగల్ టీచర్ వల్ల ఒరిగేదిలేదు. విద్యాశాఖ అధికారుల తీరుపై గ్రామస్థులు మండిపడుతున్నారు. పాఠశాలను కాపాడుకునేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు.

ఒక విధంగా పాఠశాలను ఎత్తివేయటమే..



విలీనం పేరుతో పాఠశాలను ఎత్తివేయటమే ఇది. అధికారుల తీరుతో 3వ తరగతి చదువుతున్న మా పాప గీతను ఎక్కడ జాయిన్ చేయాలో అర్థంకాని పరిస్థితి. మిగతా పిల్లలు రోడ్డున పడ్డారు. మేమంతా వ్యవసాయ కూలీలం. ప్రైవేటు పాఠశాలల్లో చదివించుకునే ఆర్థిక స్తోమత లేదు. ఊళ్లో ఉన్న పాఠశాలను తీసివేయటం సరికాదు.

–నల్లబెల్లి రాము, శ్రీరాంపురం

అధికారులే సమాధానం చెప్పాలి..



మా పిల్లల చదువుకు అధికారులే బాధ్యత వహించాలి. బేసిక్ ప్రైమరీ పాఠశాలగా కొనసాగించాలని స్కూల్ కమిటీ తీర్మానం ఇచ్చినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదు. మా బాబు పూర్ణచంద్ర 4వ తరగతి చదువుతున్నాడు. వాడి చదువు అయోమయంలో పడింది. పాఠశాలను యథావిధంగా కొనసాగించాలి.

– ఎస్.రత్నం, శ్రీరాంపురం

మార్పునకు లేఖ రాశా..



సాంకేతిక లోపం వల్ల పొరపాటు జరిగింది. లోపాన్ని గుర్తించిన వెంటనే ఫౌండేషన్ స్కూల్ కాకుండా యథావిధిగా బేసిక్ ప్రైమరీ పాఠశాలగా సవరణ చేయాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారికి లేఖ రాశాను. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన విజ్ఞాపన పత్రాన్ని డీఈవోకు పంపించాను.

–సిహెచ్.తలుపులు, ఎంఈవో, నర్సీపట్నం

తమిళనాడు పోలీసులపై దాడి

కిడ్నాపర్లుగా భావించి ఘటన

కశింకోట: గంజాయి కేసులో నిందితులను తరలిస్తున్న తమిళనాడుకు చెందిన పోలీసుల వ్యాన్‌ను అడ్డగించి యువకులు దాడి చేసి రిజర్వు ఎస్ఐను స్వల్పంగా గాయపరిచారు. శనివారం రాత్రి కశింకోట వద్ద సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసుల సమాచారం ప్రకారం..బుచ్చెయ్యపేట మండలం రాజాం గ్రామానికి చెందిన యువకులు తమిళనాడులో కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వారిలో ఇద్దరు యువకులు గంజాయి కేసులో ఉన్నారని ఆరోపణపై తమిళనాడు నుంచి వ్యాన్‌లో రిజర్వు పోలీసులు సాధారణ దుస్తుల్లో వచ్చి రాజాంలో వారిని పట్టుకొని అదుపులోకి తీసుకొని తమిళనాడుకు తరలించుకు వెళుతున్నారు. అయితే ఈ విషయాన్ని గ్రామంలో ఎవరికి తెలియజేయకుండా, సాధారణ దుస్తుల్లో వచ్చిన తమిళనాడు రిజర్వు పోలీసులు ఆంధ్ర రిజిస్ట్రేషన్ నంబర్ వ్యాన్‌లో గంజాయి కేసు అంటూ నిందితులను తరలించుకు వెళుతుండగా అనుమానించి తమ గ్రామ యువకులను కిడ్నాప్ చేసి తీసుకెళుతున్నట్టు భావించి అక్కడి యువకులు వెంబడించారు. అయితే అనకాపల్లి ప్రాంతానికి వ్యాన్ చేరే సరికి ద్విచక్ర వాహనదారునితో కొంతసేపు వివాదం జరిగింది. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి వెళుతుండగా కశింకోట వద్దకు చేరే సరికి వెంబడి వస్తున్న రాజాం యువకులు చేరుకొని వ్యాన్‌ను అడ్డుకొని కొట్లాటకు దిగారు. ఈ సమయంలో తమిళనాడు రిజర్వు ఎస్ఐపై గుర్తు తెలియని యువకుడు రాయి విసిరి గాయపరిచినట్టు సమాచారం. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ విషయమై ఇంకా కేసు నమోదు కాలేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మనోజ్‌కుమార్‌ను సంప్రదించగా తెలిపారు.

పేదలపై కక్ష రాజకీయాలు

మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



పాక్షికంగా కూలగొట్టిన ఇంటి వద్ద మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, నాయకులు

కోటవురట్ల: కూటమి ప్రభుత్వం విధ్వంసకర పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ పరిశీలకులు డి.వి.సూర్యనారాయణరాజు ధ్వజమెత్తారు. మండలంలోని గొట్టివాడ జగనన్న కాలనీలో కట్టుమూరి అప్పారావు నిర్మించుకున్న ఇంటిని రెవెన్యూ అధికారులు పాక్షికంగా కూలగొట్టిన సంగతి తెలిసిందే. మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, పార్టీ నాయకులు శనివారం ఇల్లును పరిశీలించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ హోం మంత్రి అనిత ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంలోనే పేదలపై కక్షా రాజకీయాలు చేయడం దారుణమన్నారు. బాధితుడు స్టేటస్ కో తీసేస్తే ఇల్లు కట్టుకోవచ్చని నమ్మించి ఇప్పుడు పాక్షికంగా కూలగొట్టారని ఆరోపించారు. బాధితుడి తరఫున న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ సుంకపూరుకు చెందిన టీడీపీ నేత సుమారు రూ.కోటి విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కట్టడాలు నిర్మిస్తుంటే చోద్యం చూస్తున్నారన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌ఎస్ సత్యనారాయణ రాజు, మాజీ ఎంపీటీసీ యల్లపు కుమారరాజా, పార్టీ గ్రామ అధ్యక్షుడు రాచపతి వెంకటరావు, నాయకులు కట్టుమూరి అప్పారావు, సుంకర గిరి, నాగేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రాధాన్యత ప్రదేశాల్లో సీసీ కెమెరాలు


సీఐ విజయకుమార్

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ప్రాధాన్యత ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పట్టణ సీఐ టి.వి. విజయకుమార్ తెలిపారు. నాలుగు రోడ్ల జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, రింగ్ రోడ్, రైల్వే స్టేషన్, బైపాస్ రోడ్ జంక్షన్, కొత్తూరు జంక్షన్, రైల్వే అండర్ బ్రిడ్జి, చిన నాలుగు రోడ్ల జంక్షన్ తదితర ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికప్పుడు వాటి నిర్వహణను పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎక్కడైనా పనిచేయనవి ఉంటే వాటిని వెంటనే రిపేర్ చేయించి వాడుకలోకి తీసుకొస్తున్నామన్నారు. వీటి వల్లే పలు నేరాలను తక్కువ సమయంలోనే సునాయాసంగా ఛేదించగలుగుతున్నామన్నారు. ఇటీవల కిడ్నాప్‌కు గురైన లోహితను సీసీ కెమెరాల సాయంతోనే పట్టుకుని తల్లి వద్దకు చేర్చామని తెలిపారు. పలు వ్యాపార సంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి వారితో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పలు చోట్ల కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. మండలాల్లో వీటి సంఖ్యను పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లా పంచాయతీ అధికారికి ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తే ఉపయోగం ఉంటుందో తగిన వివరాలతో వినతిపత్రం అందజేశామన్నారు.

ఏజెన్సీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

అనకాపల్లి టౌన్: గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని నోబల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ తెలిపారు. జీవో నంబరు 117తో మారుమూల గిరిజన ప్రాంతాలకు బదిలీ అయిన మైదాన ప్రాంత ఉపాధ్యాయుల సమస్యపై పలు దఫాలు గా విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అందువల్ల గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లుగా విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో మరలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ మాసం చివరి శనివారం పురస్కరించుకొని వజ్ర కవచాలంకృతులతోపాటు వివిధ రకాల పూలమాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు దర్శించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 215 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,300	4,940
రెండో రకం	3,250	4,490
మూడోరకం	3,250	3,680

అనకాపల్లి సినిమాలు

నిశ్శబ్ద ప్రేమ : రాజా
శుభం : సత్యనారాయణస్క్రీన్-1
లవ్‌లీ : సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
సత్యనారాయణ స్క్రీన్-2 : శుభం, (ఉదయం, మధ్యాహ్నం)
హిట్-3 : పర్తిసాయి
సింగల్ : షిర్డీసాయి
ఏసీఈ : వెంకటేశ్వర
వర్షం : శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ : రామచంద్ర

గ్యాస్ సమాచారం

అనకాపల్లి:ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 365 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 318 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 12 యూనిట్లు, బీ పాజిటివ్ -11 యూనిట్లు, ఓ పాజిటివ్ -11, ఏబీ పాజిటివ్ -4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

గ్రాండ్ సాక్షి రిపోర్ట్


అనకాపల్లి నుంచి తుమ్మపాల వెళ్లే రహదారి

కూటమి అధికారంలోకి వచ్చి వచ్చే నెల 12వ తేదీతో ఏడాది పాలన పూర్తి చేసుకోనుంది. ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాల ఊసేలేదు. సరికదా.. కనీసం రోడ్లయినా బాగు చేశారంటే.. అదీ లేదు. గత సంక్రాంతి కల్లా గోతులు లేకుండా రోడ్లు మరమ్మతులు చేస్తామన్నారు. ఎక్కడా గోతులు పూడ్చిన పాపాన పోలేదు. ఉగాదిలోగా రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామని మళ్లీ ప్రగల్భాలు పలికారు. ఈ సారి అవన్నీ వట్టిమాటలే అని తేలిపోయింది. క్షేత్ర స్థాయిలో గోతుల రోడ్లపైనే వాహనదారులకు ప్రమాదకర ప్రయాణం తప్పడం లేదు.


సుందరయ్యపేట శివారు లాలంకొత్తూరు వద్ద గోతులు పడి అధ్వానంగా రోడ్డు

- రోడ్లు అభివృద్ధిపై ప్రగల్భాలు
- సంక్రాంతి, ఉగాది వెళ్లినా **అధ్వానంగానే** రహదారులు
- అనకాపల్లి మండలంలో **9 రోడ్ల పనుల్లో** నాణ్యత డొల్ల
- కూటమి నేతల కాసుల **కక్కుర్తికి** గోతులమయం

కూటమి వట్టిమాటలు

అనకాపల్లి: కూటమి పాలనలో మండలంలో పలు రహదారులకు మరమ్మతులు తూతూ మంత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు. దాంతో గోతులను పూడ్చిన రెండు మాసాలకే యథావిధిగా దర్శనమిస్తున్నాయి. అనకాపల్లి మండలంలో గతేడాది డిసెంబర్‌లో తొమ్మిది రహదారులకు రూ.72 లక్షలతో పనులు చేపట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు గోతులు పూడ్చివేత పనులు చేపట్టారు. ఇందులో కూటమి నేతలు చేతివాటం చూపించడటంతో ఇటీవల కురిసిన వర్షాలకు రాళ్లు తేలిపోయి మళ్లీ గోతులతో దర్శనమిస్తున్నాయి. దాంతో వీటి మరమ్మతులకు వెచ్చించిన సొమ్ము బూడిదలో పోసిన పన్నీరైంది. మండల పరిధిలో 50 కిలోమీటర్ల మేరకు అనకాపల్లి–మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం, మార్టూరు, రేబాక, కొప్పాక, తోటాడ రోడ్డు, కుంచంగి, తగరంపూడి, వెంకుపాలెం పంచాయతీ పరిధిలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దాంతో **ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు అనకాపల్లి పట్టణానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు** పడుతున్నారు.

క్వారీ లారీలతో రోడ్లన్నీ ధ్వంసం

అనకాపల్లి టౌన్: అనకాపల్లి నుంచి తుమ్మపాల రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రహదారిపై నిత్యం క్వారీ లారీలు రాకపోకలతో ధ్వంసమైంది. చోడవరం, మాడుగుల ప్రాంతాలకు ఈ దారే ప్రధాన రహదారి కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. సంక్రాంతి నాటికి రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన కూటమి పాలకులకు నేటికీ వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు.

రోడ్లపై గోతుల్లో నీరు చేరి తటాకంగా..

తుమ్మపాల: పల్లెల్లో దుర్భరంగా ఉన్న రోడ్లకు ఉగాది నాటికి మరమ్మతులు చేపట్టి అభివృద్ధి చేస్తామని ప్రచారాలు చేసిన కూటమి ప్రభుత్వం ఉగాది పూర్తయి మే నెలాఖరు వచ్చినా ఎటువంటి చర్యలకు పూనుకోలేదు. దీంతో పల్లెల్లో రోడ్లన్నీ దుర్భరంగానే దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. **మండలంలో మేజర్ పంచాయతీ తుమ్మపాల మొదలుకుని ఏ** ఒక్క గ్రామంలోనూ రోడ్ల దుస్థితిపై కూటమి నాయకుల దృష్టి సారించకపోవడంతో ప్రజలంతా వారి మోసపూరిత హామీలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో తుమ్మపాలలో పలు రోడ్లతో పాటు అనకాపల్లి

◆ చోడవరం రోడ్డు మామిడిపాలెం వరకు రోడ్లు దుర్భరంగా తయారయ్యాయి. బవులువాడ ఆర్‌వీఎస్ నగర్ వద్ద పెద్ద గోతులు ఏర్పడి కంకర పిక్కలు తేలి ఉండటంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మార్టూరు రోడ్డు మరింత దారుణంగా తయారైంది. జన జీవనంతోపాటు మైనింగ్ వాహనాల రాకపోకలకు కూడా ఇదే రహదారి కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చింతనిప్పుల అగ్రహారం రోడ్డు అధ్వానంగా ఉండటంతోపాటు క్వారీ వాహనాలు పరిమితికి మించి లోడింగ్‌తో రాకపోకలు చేయడంతో గ్రామస్తులంతా ఏకమై వాటి రాకపోకలను నిలిపివేశారు. ఈ నేపథ్యంలో రోడ్డు **బాగు చేయాలని మైనింగ్ లారీల రాకపోకలకు మరో రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తున్నారు.**

జి. భీమవరం – కన్నూరుపాలెం రోడ్డు గోతులమయం..

కశింకోట: మండలంలోని జి. భీమవరం నుంచి కన్నూరుపాలెం వరకు రోడ్డుకు గోతులు పడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అరకొర నిధులతో కంటి తుడుపుగా మరమ్మతులు చేపట్టారు. జి. భీమవరం, లాలంకొత్తూరు, చిన్నయ్యపాలెం తదితర ప్రాంతాల్లో రోడ్డుకు గోతులు ఏర్పడ్డాయి. ప్రధానంగా మదుంల వద్ద గోతులు పడటంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఒక్కొక్కసారి ప్రమాదాలకు గురి కావలసి వస్తోందని వాపోతున్నారు. గతేడాది ఐదు కిలోమీటర్ల మేర తాళ్లపాలెం–నర్సీపట్నం మధ్య రోడ్డులో రూ.7 లక్షలతో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ మరమ్మతులు చేశారు. నామ మాత్రంగా మెటల్, తారువేసి పూడ్చి మమ అనిపించారు. ఆ తర్వాత వాహనాల తాకిడికి దెబ్బతిని గోతులమయంగా మారింది. దీంతో స్థానికులు ఇదేమి చోద్యం అంటూ విస్తుపోతున్నారు. ఆ మార్గంలో గతుకుల వల్ల రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది చెందుతున్నారు. ఈ రోడ్డు పూర్తిస్థాయిలో మరమ్మతులకు ప్రతిపాదించినా నిధులు రాలేదని అధికారిక సమాచారం. దీంతో నిత్యం ఇక్కట్లు తప్పడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తుమ్మపాల నుంచి అనకాపల్లి వెళ్లే రహదారి


బవులువాడ ఆర్‌వీఎస్‌నగర్ వద్ద దారుణంగా అనకాపల్లి-చోడవరం రోడ్డు


మండలంలో ఏఎంఏఎల్ కొత్తూరు రహదారిలో పెద్దగొయ్యి


క్రషర్ బుగ్గితో గుంతలను కప్పిన మార్టూరు రోడ్డు

ఎండీయూ విధానాన్ని కొనసాగించాలి

అనకాపల్లి: గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఏర్పాటు చేసిన ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనాలు (ఎండీయూ) విధానాన్ని రద్దు చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు ఏడాది పాలనలో దశలు వారీగా నిరుద్యోగ సమస్యను పెంచుతున్నారన్నారు. రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌కు ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం చేయాలనే ఉద్దేశం ఉంటే, కేరళ మాదిరిగా పేదలకు రేషన్ దుకాణాల ద్వారా 16 రకాల నిత్యావసర సరకులను పంపిణీ చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం అన్యాయమన్నారు. అప్పటి ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఎండీయూ వాహనాలకు 2027 వరకు అగ్రిమెంట్ ఉన్నప్పటికీ రద్దు చేయడం అన్యాయమన్నారు. వాహనాల ఈఎంఐలు కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలుపై దృష్టి పెట్టినట్లయితే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

ఎండీయూ వ్యవస్థ రద్దు చేయడం అన్యాయం..

పేదలకు ఎండీయూ వ్యవస్థ ద్వారా అందిస్తున్న వాహనాలను రద్దు చేయడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడాది పాలనలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌పై ప్రజలు విసుగు చెందారని, రానున్న రోజుల్లో వారు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తక్షణమే ఎండీయూ వాహనాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

నిరాశ్రయునికి ఆశ్రయం

పెందుర్తి: అనారోగ్యానికి గురై కుటుంబ సభ్యుల నుంచి నిరాదరణకు గురైన ఓ వ్యక్తికి పెందుర్తి పోలీసులు ఆశ్రయం కల్పించారు. వివరాలివి.. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు కురువాడ గ్రామానికి చెందిన పేరూరి వరహాలు (40) అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో సంరక్షణ కొరవడడంతో ఇంటి నుంచి బయటికి వచ్చి పెందుర్తిలోని బస్టాండ్‌లో ఉంటున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ కె.వి. సతీష్‌కుమార్ వరహాలకు లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించేందుకు ఆశ్రమ వ్యవస్థాపకుడు డి.ప్రకాశరావుతో మాట్లాడి తగిన చర్యలు తీసుకున్నారు. బ్లూకోట్స్ పీసీ చంద్రశేఖర్ శనివారం అతన్ని లయోలా ఆశ్రమానికి అప్పగించారు.


వరహాలుని లయోలా ఆశ్రమానికి అప్పగిస్తున్న పీసీ చంద్రశేఖర్

మహిళా హక్కులను గుర్తుచేసిన ‘మూల్యం’


మహా ప్రస్థానంలో సన్నివేశం


‘నాన్న నేనొచ్చేస్తా’ నాటికలో సన్ని వేశం

కశింకోట: సమాజంలో అనేక విధాలుగా వివక్షకు గురవుతున్న మహిళ శంఖా రావడం చేసి తమ హక్కులను సాధించిన కథాంశంగా ‘మూల్యం’ నాటిక ఆహూతులను అలరించింది. కశింకోటలోని గవరపేటలో అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలో భాగంగా శనివారం రాత్రి నాటిక ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన గోవాడ క్రియేషన్స్ బృందం నాటికను ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకుంది.

విశేషంగా ఆకట్టుకున్న ‘ నాన్నా నేనొచ్చేస్తా...’

వాస్తవికతకు దగ్గరగా ఉన్న ‘నాన్నా...నేనొచ్చేస్తా!’ సందేశాత్మక నాటిక ఆహూతులను విశేషంగా అలరించింది.. తల్లిదండ్రులు ఆడ పిల్లలను మితిమీరిన వాత్సల్యం, మమకారంతో గారాబం చేస్తూ వెనకేసుకు రావడంతో పెళ్లైన కొంత కాలానికే వైవాహిక జీవితంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడి పరిష్కరించుకోలేక కాపురాలు కూలిపోతున్నాయి. పెళ్లంటే సర్దుబాటు, సంసారం అంటే దిద్దుబాటు అన్న సూత్రాన్ని అర్థం చేసుకోలేని పరిస్థితులు తదితర అంశాల ఆధారంగా అంశంగా కథ సాగింది. ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. విజయవాడ గురజాడ కళా మందిర్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ‘మహా ప్రస్థానం’ పేదరికాన్ని అధిగమించడం కోసం డబ్బు సంపాదన కోసం విదేశాలు వెళ్లి మోసపోయి ఎటువంటి కష్టాలను అనుభవిస్తున్నారో? చావుకు ఎలా దగ్గరవుతున్నారో? తెలిపే యదార్థ దృశ్యాలతో ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు.

మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు


మాట్లాడుతున్న ఏఎస్ఐ మణికుమారి

కశింకోట: బాలికలు, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని, వాటి పట్ల అవగాహన కలిగి ఉండటం అవసరమని ఏఎస్ఐ ఎస్. మణికుమారి తెలిపారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో మహిళా చట్టాలపై బాలికలకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకతాయిల బారి నుంచి రక్షణ పొందడానికి, మహిళలకు రక్షణకు కలిగించే శక్తి టీం గురించి, పోక్సో చట్టం గురించి అవగాహన కలిగించారు. హెచ్‌ఎం ఎంఆర్వీ అప్పారావు, ఉపాధ్యాయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నరసాపురం ఆనకట్టకు మరమ్మతులు

కశింకోట: మండలంలోని ఏఎస్‌పేట వద్ద శారదా నదిపై నరసాపురం ఆనకట్టకు మరమ్మతులు చేపట్టనున్నట్లు నీటి సంఘం అధ్యక్షుడు ఉప్పులూరు అప్పలనాయుడు తెలిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు సమస్యపై విన్నవించిన మేరకు అందుకు చర్యలు చేపట్టాలని ఇటీవల అధికారులకు సూచించారన్నారు. ఈ నేపథ్యంలో యలమంచిలి నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు వచ్చి పరిశీలించారన్నారు. ఆనకట్ట గట్లకు మరమ్మతులు, సాగునీటి కాలువల పూడికతీత పనులు చేపట్టడానికి అంచనాలు రూపొందించారన్నారు.

సామాన్య జీవనానికి అద్దం పట్టే ‘జనరల్ బోగీలు’


జనరల్ బోగీలు నాటికలో సన్ని వేశం

కశింకోట: జనరల్ బోగీలో రైలు ప్రయాణం వల్ల ప్రయాణికులు పడుతున్న కష్టాలు, దానిలో ప్రయాణం చేయడం వల్ల కలిగే నష్టాలు కథాంశంగా సాగిన ‘జనరల్ బోగీలు’ నాటిక ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. దీన్ని రెండో నాటికగా గవరపేటలో ప్రదర్శించారు. జనరల్ బోగిలో ప్రయాణం చేస్తూ ప్రమాదానికి గురయితే వారి వివరాలు తెలియక ప్రభుత్వం నుంచి లబ్ధి పొందలేకపోవడం, సదుపాయాలు లేక ఎదుర్కొంటున్న ఇబ్బందుల తొలగింపునకు సావిత్రమ్మ అనే మహిళ జైలుకు వెళ్లినా పోరాటాన్ని కొనసాగిస్తుంది. ఇది కథాంశంగా సాగింది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా ఆయుష్ శాఖ అధికారి లావణ్య


మాట్లాడుతున్న జిల్లా ఆయుస్ శాఖ అధికారి డాక్టర్ లావణ్య


యోగాసనాలు చేస్తున్న వివిధ శాఖల సిబ్బంది

అనకాపల్లి: యోగాతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని జిల్లా ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ కె.లావణ్య తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ‘యోగాంధ్ర – 2025’లో భాగంగా శనివారం స్థానిక గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో 25 మంది యోగా గురువులతో వంద మంది మాస్టర్ ట్రైనీలకు యోగా ప్రొటోకాల్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 నుంచి నెల రోజుల పాటు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో యోగా కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి ప్రశాంతత లభిస్తుందన్నారు. మారుతున్న కాలంలో బిజీ షెడ్యూల్‌లో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదని, అందువల్ల చిన్న వయసులోనే మధుమేహం, దృష్టిలోపం వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటారని, అలసట ఉండబోదన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.మనోరమ, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.వి. జ్యోతి, ఆయుష్ విభాగం వైద్యాధికారులు, యోగా శిక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌కు దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కశింకోట: ఇళ్లలో సోలార్ విద్యుత్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడానికి మహిళలు నడుం బిగించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. మండలంలోని బయ్యవరంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సోలార్ విద్యుత్ కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు పేదలకు విద్యుత్ భారం ఉండబోదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సగం రాయితీపై సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో పది వేల సోలార్ విద్యుత్ యూనిట్‌లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. పైలట్ ప్రాజెక్టుగా బయ్యవరం గ్రామంలో సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కూటమి నాయకులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.